నేటి బంద్‌ను జయప్రదం చేయండి

గౌలిపురా: గౌలిపురా డివిజన్ పరిధిలో ఉన్న వివిధ వ్యాపార యజమానులు బీసీ జేఏసీ ఆధ్వర్యంలో 42 శాతం రిజర్వేషన్ కోసం రాష్ట్ర బంద్‌కు సహకరించి విజయవంతం చేయాలని సీపీఐ డివిజన్ కార్యదర్శి సీ.ఎం.గౌడ్ పిలుపునిచ్చారు. 42 శాతం రిజర్వేషన్ దేశ సర్వోన్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పును నిరసిస్తూ తలపెట్టిన బంద్ పిలుపునకు సంపూర్ణ మద్దతు ఇస్తూ చిన్న పెద్ద తేడా లేకుండా అన్ని వ్యాపార సంస్థలు స్వచ్ఛందంగా బంద్ పెడుతూ విజయవంతం చేయడానికి సహకరించాలన్నారు.

26న కృత్రిమ అవయవాల పంపిణీ

జియాగూడ: లయన్స్ ఇంటర్నేషనల్ తెలంగాణ అమెరికా తెలుగు సంఘం వారి సహకారంతో ఈ నెల 26న ఆదివారం ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటలకు ఉచితంగా కృత్రిమ అవయవాల పంపిణీ కోసం స్క్రీనింగ్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు గ్రేటర్ క్లబ్ అధ్యక్షుడు లయన్ లింగయ్య పూస, ప్రోగ్రాం డిస్ట్రిక్ట్ కో ఆర్డినేటర్ లయన రవీందర్‌రావు బాచుపల్లి, జాయింట్ కో ఆర్డినేటర్ పరమేష్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమం హయత్‌నగర్ పొద్దార్ ఇంటర్నేషనల్ స్కూల్ ఉంటుందన్నారు.

విద్యార్థులను క్రీడల్లో ప్రోత్సహించాలి



అబిడ్స్: పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులను క్రీడల్లో ప్రోత్సహించాలని హోలీ ఫ్యామిలీ హైస్కూల్ ప్రిన్సిపాల్ రెవరెండ్ నిర్మల అన్నారు. రెండు రోజులుగా ఎల్బీస్టేడియంలో హైదరాబాద్ డిస్ట్రిక్ట్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 69వ ఎస్‌జీఎఫ్ ఇంటర్‌స్కూల్స్ వాలీబాల్ టోర్నమెంట్ వేడుకలు ముగిశాయి. వివిధ విభాగాలలో గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులను అందజేశారు. బాలికలు జిల్లా స్థాయిలో రాణించడం ఎంతో సంతోషంగా ఉందని రాబోయే రోజుల్లో రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు.

తానాజీనగర్‌లో 'సప్త శక్తి సంగం'



చాంద్రాయణగుట్ట: ఉప్పుగూడ తానాజీనగర్ లోనిశ్రీసరస్వతీ శిశు మందిర్‌లో శుక్రవారం సప్త శక్తి సంగం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆర్ఎస్ఎస్ స్థాపించి వందేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో గౌలిపురా కార్పొరేటర్ ఆలే భాగ్యలక్ష్మి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాల గొప్పతనం, కుటుంబ వ్యవస్థ, దేశ రక్షణ కోసం పోరాడిన వీరమణుల విషయమై చర్చించారు. ఈ కార్యక్రమంలో చార్మినార్ బాగ్ సేవిక పొన్న లత, శిశు మందిర్ పూర్వ ఆచార్యులు పల్లాలమ్మ, ఉమ, అర్చన తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా మద్యం అమ్ముతున్న వ్యక్తి అరెస్ట్

విజయనగర్‌కాలనీ: అక్రమంగా మద్యం అమ్ముతున్న ఓ వ్యక్తితో పాటు మద్యంను స్వాధీనం చేసుకున్న ఘటన శుక్రవారం ఆసిఫ్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ రాకేష్ తెలిపిన వివరాల ప్రకారం..ఆసిఫ్‌నగర్ చంద్ర వైన్స్ సమీపంలోని ఓ ఇంట్లో సుదర్శన్(32) అక్రమంగా మద్యం నిల్వచేసి విక్రయిస్తుండగా విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. నిందితుడి వద్ద నుంచి 250 బాటిళ్ల 9 రకాల మద్యం సీసాలతో పాటు రూ.12,210 నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

గంజాయి విక్రయిస్తున్న ఇద్దరి రిమాండ్

దబీర్‌పురా: గంజాయిని విక్రయిస్తున్న ఇద్దరిని రెయిన్‌బజార్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసుల వివరాల ప్రకారం..రెయిన్‌బజార్ ప్రాంతానికి చెందిన రెహమాన్ షరీఫ్ అలియాస్ అమీర్ (27), సికింద్రాబాద్ వారాసిగూడకు చెందిన సయ్యద్ సమీర్ మలిక్ (26)లు కలిసి గంజాయి సేవించడంతో పాటు అవసరమైన వారికి విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. వీరిద్దరూ కలిసి ప్రధాన గంజాయి సప్లాయర్ మహారాష్ట్ర నాగపూర్ షాహీ శ్మశాన వాటిక ప్రాంతానికి చెందిన సాబ్రీ ఖాద్రీ వద్ద కొనుగోలు చేసి నగరానికి తీసుకొచ్చి విక్రయిస్తుంటారు. ఈ నెల 16న అమీర్, సమీర్‌లు కలిసి యాకుత్‌పురా రెయిన్‌బజార్ పత్తర్‌కా కమాన్ వద్ద గంజాయిని విక్రయిస్తుండగా.... విశ్వసనీయమైన సమాచారం మేరకు రెయిన్‌బజార్ పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో అమీర్, సమీర్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసులోని ప్రధాన నిందితుడు సాబ్రీ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

ధంతేరాస్..మార్కెట్ జోష్

జియాగూడ: దీపావళి పండుగలో భాగంగా శనివారం ధంతేరాస్ దీవస్ పూజలు ఉండడంతో పలు ప్రాంతాలు రద్దీగా మారాయి. గృహ అలంకరణ వస్తువులు, పూజా సామాగ్రి, దీపంతల విద్యుత్ లైట్స్ తదితర కొనుగోళ్లతో బేగంబజార్ మార్కెట్లు కిటకిటలాడాయి. దీంతో బేగంబజార్‌లోని ఛత్రి, ఫీల్‌ఖానా, భర్తన్‌బజార్, సిద్ధిఅంబర్‌బజార్, ఉస్మానియా తదితర ప్రాంతాలు రద్దీగా మారాయి. ధంతేరాస్ దీవస్‌కు బంగారం ధరలు ఆకాశాన్నంటాయి. బంగారం 10 గ్రాములు రూ.1,34,990 లక్షలకు చేరింది. అయినప్పటికీ సిద్ధిఅంబర్ బజార్ చౌరస్తాలో బంగారం కొనేందుకు బారులు తీరారు. అలాగే వెండి ధర కేజీ.రూ.1,90,000 లక్షలు పలుకుతుంది.



ఇంటి అలంకరణ వస్తువులు



ప్లాస్టిక్ విద్యుత్ దీపాలు



సిద్దిఅంబర్‌బజార్ చౌరస్తా రద్దీ



బంగారం కొనేందుకు బారులు తీరిన దృశ్యం

ఆస్తి పన్ను తప్పనిసరిగా చెల్లించాలి



ఉమా ప్రకాష్

అబిడ్స్: ఆస్తిపన్నుకు సంబంధించిన పీటీఐఎన్ నెంబర్ ఉన్నా..అక్కడ వ్యాపారాలు నిర్వహిస్తూ ట్రేడ్ లైసెన్స్ లేకుండా వ్యాపారాలు నిర్వహిస్తున్న వారిపై జీహెచ్ఎంసీ అధికారులు దాడులు నిర్వహించి ట్రేడ్ లైసెన్స్‌లు పొందేలా చర్యలు తీసుకుంటున్నారు. అదే విధంగా ట్రేడ్ లైసెన్స్ కలిగి ఉండి వ్యాపారాలు నిర్వహిస్తూ ఆస్తిపన్ను చెల్లించని వారిని సైతం గుర్తించి వారు ఆస్తిపన్ను చెల్లించేలా చూస్తున్నారు. జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్‌వి.కర్ణన్ ఆదేశాల మేరకు 14వ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ఉమా ప్రకాష్ నేతృత్వంలో ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్‌లు, బిల్ కలెక్టర్‌లు 22 డాకెట్‌ల వాకీగా ఈ తనిఖీలను చేపడుతున్నారు. ప్రతి నిత్యం ఓ ప్రాంతాన్ని ఎంచుకుని ఆ ప్రాంతంలో వ్యాపారాలు నిర్వహిస్తున్న వారికి ట్రేడ్ లైసెన్స్‌లు ఉన్నాయా, ఉంటే ఆస్తికి సంబంధించి ఆస్తిపన్ను చెల్లిస్తున్నారా, నిర్మాణం చేసిన మేరకు ఆస్తి పన్ను అసెస్‌మెంట్ అయ్యిందా, వీటన్నింటిని పరిశీలించి ఏవైనా తేడాలు ఉంటే సరి చేసుకునేలా సూచనలు చేస్తున్నారు. ప్రతి నిత్యం ఆరు మంది ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్లుగా జీహెచ్ఎంసీ ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ కార్యాలయం నుంచి అదనంగా స్టాఫ్‌ను కేటాయించడంతో పరిశీలన వేగవంతం చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ ఉమా ప్రకాష్ మాట్లాడుతూ..ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా బకాయి పడిన ఆస్తిపన్ను చెల్లించాలని, వ్యాపారులు తప్పనిసరిగా ట్రేడ్ లైసెన్స్‌లు పొందాలని, ట్రేడ్ లైసెన్స్‌లు ఉన్న వారు రెన్యువల్ చేసుకోవాలని సూచించారు.

దీపావళికి భాగ్యలక్ష్మి ఆలయం ముస్తాబు



చార్మినార్: దీపావళి వేడుకలను పురస్కరించుకుని ఆరు రోజుల పాటు నిర్వహించే ప్రత్యేక పూజలకు చార్మినార్ భాగ్యలక్ష్మి ఆలయం సర్వాంగ సుందరంగా ముస్తాబయ్యింది. ఈసారి దీపావళి వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించడానికి ఇప్పటికే తగిన ఏర్పాట్లు పూర్తి చేశారు. శనివారం నిర్వహించే ధంతేరస్ పూజలతో ఈసారి దీపావళి ప్రత్యేక పూజలు ప్రారంభం కానున్నాయి. భాగ్యలక్ష్మి ఆలయంలో ప్రతి ఏడాది ఉత్సవాలను ప్రతిష్టాత్మకంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. కట్టుదిట్టమైన భద్రతా చర్యల నడుమ వేడుకలు జరుగనున్నాయి. పలువురు అధికార, అనధికార ప్రముఖులు చార్మినార్ భాగ్యలక్ష్మి ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు.

అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు..



చార్మినార్ భాగ్యలక్ష్మి ఆలయంలో దీపావళి వేడుకలు ఈ నెల 18న ప్రారంభమై 23వ తేదీతో ముగియనున్నాయి. ఇందులో భాగంగా భక్తులకు ఎక్కడ ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా ప్రభుత్వంలోని వివిధ విభాగాలకు చెందిన అధికారులు తగిన ఏర్పాట్లు చేశారు. ఉత్సవాల్లో భాగంగా ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మతో పాటు పలువురు కేంద్ర, రాష్ట్ర మంత్రులు పాల్గొననున్నారు. ఇక ఉత్సవాల్లో భాగంగా అమ్మవారి ఖజానా పంపిణీకి ఎంతో ప్రాధాన్యత ఉన్నందున..ఖజానా పొందేందుకు వచ్చే భక్తుల రద్దీకి అనుగుణంగా ప్రత్యేకంగా బారికేడ్లు ఏర్పాటు చేస్తున్నాం. – శశికళ, ఆలయ ట్రస్టీ

బీసీ సామాజిక ఉద్యమానికి సాహిత్యరంగం గజ్జకట్టాలి



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న జూలూరు గౌరీశంకర్ తదితరులు

గన్‌ఫౌండ్రీ: బీసీ హక్కుల సాధనకు జరుగుతున్న సామాజిక ఉద్యమంలో బీసీ కవులు, రచయితలు, సాహితీవేత్తలు తమ భుజాలపై వేసుకొని ముందుకు సాగాలని తెలంగాణ సాహిత్య అకాడమి మాజీ చైర్మన్ జూలూరు గౌరీశంకర్ అన్నారు. శుక్రవారం రవీంద్రభారతిలో తెలంగాణ రాష్ట్ర భాషా, సాంస్కృతిక శాఖ సౌజన్యంతో తెలంగాణ పబ్లికేషన్స్ ఆధ్వర్యంలో రచయిత కేపీ అశోక్‌కుమార్ రచించిన తెలుగు సాహిత్యంలో బీసీ నవల అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గౌరీశంకర్ మాట్లాడుతూ..బీసీ సామాజిక ఉద్యమానికి సాహిత్యరంగం గజ్జకట్టాలన్నారు. బీసీల ఆర్థిక, రాజకీయ, సామాజిక న్యాయ హక్కుల కోసం సంస్థ బీసీ సమాజాన్ని కదిలించేందుకు బీసీ సాహితీవేత్తలు ఆటపాటమాటలతో గళం విప్పాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఓయూ తెలుగు ప్రొఫెసర్ ఎస్.రఘు, సాహితీవేత్తలు ఏకే.ప్రభాకర్, కె.కోటేశ్వర్‌రావు, తెలంగాణ పబ్లికేషన్ అధినేత కె.చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులను శాస్త్రీయ కళల్లో ప్రోత్సహించాలి



గన్‌ఫౌండ్రీ: చిన్నారులను శాస్త్రీయ, సంగీత కళల్లో ప్రోత్సహించాలని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఓఎస్‌డీ వేముల శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం రవీంద్రభారతిలో పాఠశాల విద్యాశాఖ సౌజన్యంతో నట్రాజ్ అకాడమీ ఆధ్వర్యంలో తెలంగాణ సీఎం డ్యాన్స్ కప్ పేరిట నేషనల్ డ్యాన్స్ ఫెస్టివల్ నిర్వహించారు. ఈ సందర్భంగా దేశభక్తి, తెలంగాణ సాంస్కృతిక, సంప్రదాయ పాటలతో చిన్నారులు హోరెత్తించారు. ఈ పోటీల్లో జంటనగరాలకు చెందిన 15 పాఠశాలల విద్యార్థులు పాల్గొనగా గెలిచిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో జానపద గాయకుడు నర్సింహారెడ్డి (నల్గొండ గద్దర్) సరస్వతి ఉపాసకులు దైవాజ్ఞశర్మ, సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు నల్ల గిరి తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ బంద్‌కు బీఆర్ఎస్ సంపూర్ణ మద్దతు



తలసానితో బంద్ వివరాలు వెల్లడిస్తున్న గడ్డం శ్రీనివాస్‌యాదవ్ తదితరులు

సుల్తాన్‌బజార్: బీసీ రిజర్వేషన్లు 42 శాతం పెంపుపై ఈ నెల 18న బీసీ జేఏసీ తలపెట్టిన తెలంగాణ బంద్‌కు బీఆర్ఎస్ పార్టీ సంపూర్ణ మద్దతును తెలుపుతుందని మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్, మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్, బీఆర్ఎస్ నాయకుడు గడ్డం శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు. ఈ మేరకు తెలంగాణ భవన్‌లో మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌తో జరిగిన సమావేశంలో గడ్డం శ్రీనివాస్ యాదవ్ పాల్గొని గోషామహల్‌లో బంద్‌ను విజయవంతం చేసేందుకు తీసుకునే చర్యలపై ఆయనతో చర్చించారు. అనంతరం శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతూ..20 నెలలుగా కాంగ్రెస్ ప్రభుత్వం అన్నిరంగాల్లో ఘోరంగా విఫలమైందని ఆయన ఆరోపించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

లంగర్‌హౌస్: విద్యుత్ మరమ్మతుల కారణంగా మెహిదీపట్నం విద్యుత్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ ఏడీఈ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 32/11కేవీ గోల్కొండ సబ్‌స్టేషన్ పరిధిలోని జమాలికుంట, అరుణ కాలనీ, నదీం కాలనీ, కులీకుతుబ్‌షా నగర్, గ్రామర్ కాలనీ, సనా హోటల్, ఎస్ఎ కాలనీ, ప్రైడ్ ఆఫ్ సాండ్స్ కాలనీ, యూనిస్ నగర్, సమతా కాలనీ, ఆదిత్య నగర్, ఆడమ్స్ కాలనీ, రాహుల్ కాలనీ ఫేస్ 2, రాయల్ ఫామ్, అహ్మద్ నగర్, మాసబ్ ట్యాంక్, గార్డెన్ టవర్స్, పోలీస్ మెస్, ఖాజా నగర్, ఫస్ట్ లాన్సర్, డైమండ్ హిల్స్, ఫజల్ రెసిడెన్సీ, బంజారా ఫంక్షన్ హాల్ ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

చార్మినార్ సీబీడీ ఏడీఈ పరిధిలో..

శాలిబండ: విద్యుత్ మరమ్మతుల కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్‌సరఫరాలో అంతరాయం ఉంటుందని చార్మినార్ సీబీడీ ఏడీఈ ఓ ప్రకటనలో తెలిపారు. పేట్లబురుజు, బీబీబజార్, ఏజీ కాలనీ, కిషన్‌బాగ్ ఓహెచ్, ఘాజిబండ విద్యుత్ ఫీడర్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు. సిద్దిఖీ గుల్షన్ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

సేవా కార్యక్రమాలతోనే సమాజంలో గుర్తింపు



ఖాలేద్ అలీఖాన్‌ను సన్మానిస్తున్న దృశ్యం

గోల్కొండ: సేవా కార్యక్రమాలతోనే సమాజంలో గుర్తింపు లభిస్తుందని పీస్ ఫోర్స్ సొసైటీ తెలంగాణ చైర్మన్ మహ్మద్ నజీబ్ అన్నారు. ఉమ్రాయాత్ర చేసుకొని తిరిగి వచ్చిన సీనియర్ మజ్లిస్ నాయకులు ఖాలేద్ అలీఖాన్‌ను శుక్రవారం టోలిచౌకీ అక్బర్‌పురాలోని పీస్ ఫోర్స్ సొసైటీ కార్యాలయంలో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..తమ సొసైటీ గత దశాబ్దా కాలంగా పేద, బడుగు వర్గాల ప్రజలతో పాటు నిరుపేదలకు విశేషంగా సేవలు అందిస్తుందన్నారు. ఎన్ఆర్ఐ ఖురేషి మాట్లాడుతూ.. పీస్ ఫోర్స్ సొసైటీ వారి సేవా కార్యక్రమాలతో ఎంతో ప్రభావితుడిని అయ్యాయని అందు వల్లే స్వచ్ఛందంగా సొసైటీలో సభ్యత్వం తీసుకోవడం జరిగిందన్నారు. షేహబాజ్, సమీర్, తౌఫిక్, షఫీ, ఇమ్రాన్, ఫహాద్ తదితరులున్నారు.

ఘనంగా దుగ్గిరాల సోమేశ్వరరావు జయంతి



నాగమణికి ఆత్మీయ పురస్కారంతో సత్కరిస్తున్న కేవీ రమణాచారి

నాంపల్లి: నటుడు, దర్శకుడు దుగ్గిరాల సోమేశ్వరరావు జయంతిని సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం నందమూరి తారక రామారావు కళా మందిరంలో రసరంజని సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా జె.శశిమోహన్ (రంగస్థల నాటక రచయిత, నటుడు), ఎ.నాగమణి(రంగస్థల, టీవీ, సినిమా నటీ), రాయప్రోలు భగవాన్ (చైతన్య భారతి సంగీత నృత్య నాటక పరిషత్ నిర్వాహకులు)లకు దుగ్గిరాల సోమేశ్వరరావు ఆత్మీయ పురస్కారాలను ప్రదానం చేశారు. విశ్రాంత ఐఏఎస్ అధికారి డాక్టర్ కేవీ రమణాచారి అధ్యక్షతన జరిగిన సభకు ముఖ్యఅతిథిగా కేంద్రీయ విశ్వవిద్యాలయం విశ్రాంత ఆచార్యులు డాక్టర్ డి.ఎస్.ఎస్.మూర్తి, రంగస్థల టీవీ, సినిమా నటులు అమరేంద్ర, ప్రముఖ నాటక రచయిత డాక్టర్ దీర్ఘాసి విజయ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం మల్లీశ్వరి ఆర్ట్స్ హైదరాబాద్ వారిచే 'సుహ్వాసగం'–'సేనోసగం'నాటికను ప్రదర్శించారు.

సిటీ కాలేజీలో 'క్యాంపస్ ఎకో బజార్'



క్యాంపస్ ఎకో బజార్‌ను సందర్శించి విద్యార్థులను అభినందిస్తున్న కాలేజీ ప్రిన్సిపాల్

చార్మినార్: పండుగలను బాధ్యతాయుతంగా, పర్యావరణహితంగా జరుపుకోవడం అంటే మన సంస్కృతిని కాపాడటమే కాకుండా మన గ్రహాన్ని కూడా రక్షించడమేనని ప్రభుత్వ సిటీ కాలేజి ప్రిన్సిపాల్ ప్రొ.కె.పద్మావతి అన్నారు. శుక్రవారం కాలేజీలో నిర్వహించిన 'స్వదేశీ దీపావళి కోసం క్యాంపస్ ఎకో బజార్' కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమం తెలంగాణ నేషనల్ గ్రీన్ కార్ప్స్, పర్యావరణ, అరణ్యాలు, వాతావరణ మార్పు మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో స్వదేశీ ఉత్పత్తులను ప్రోత్సహించడం, పర్యావరణ చైతన్యాన్ని పెంపొందించడం లక్ష్యంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పద్మావతి విద్యార్థులను ప్రోత్సహిస్తూ ఇలాంటి కార్యక్రమాలు పర్యావరణ అవగాహనతో పాటు విద్యార్థుల్లో మార్కెటింగ్, నాయకత్వ నైపుణ్యాలను పెంపొందిస్తాయని అన్నారు. కాలేజీ ఈకో క్లబ్ సమన్వయంతో నిర్వహించిన ఈ బజార్‌లో సిటీ కాలేజీ, సమీప కాలేజీల విద్యార్థి బృందాలు ఏర్పాటు చేసిన వివిధ స్టాళ్లు ఆకర్షణగా నిలిచాయి. ఈ కార్యక్రమానికి ఎకో క్లబ్ కన్వీనర్ డా.టి.రాగ సుధ, టీఎన్ జీసీ కో ఆర్డినేటర్ డా.డి.నాగరాజు, సభ్యులు పి. రత్న కుమార్, డా. కె. ఆనంద్, సుమన యాదగిరి, డా. తిరుపతి, డి. శ్రవణ్ కుమార్ విద్యార్థులకు తగిన సలహాలు, సూచనలు అందించారు.

రోబోటిక్స్ పోటీల్లో డాన్ స్కూల్ విద్యార్థుల సత్తా



బహుమతిని అందుకుంటున్న వసీ ఉర్ రెహమాన్

చార్మినార్: తావూస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన ఇంటర్ స్కూల్స్ రోబోటిక్స్ కాంపిటీషన్ అండ్ ఎక్స్‌పోలో డాన్ స్కూల్ విద్యార్థులు తమ ప్రతిభను చాటుతూ అగ్రస్థానాన్ని కైవసం చేసుకున్నారు. ఈ పోటీల్లో జంట నగరాలతో పాటు రాష్ట్రంలోని 13 పాఠశాలలకు చెందిన 20 బృందాలు పాల్గొన్నాయి. డాన్ స్కూల్ మలక్‌పేట్, పురానీహవేలీ శాఖల నుంచి మూడు బృందాలు పోటీలో పాల్గొనగా, పురానీహవేలీ శాఖకు చెందిన బాలికల బృందం మొదటి బహుమతిని, మలక్‌పేట్ శాఖ బాలుర బృందం రెండో బహుమతిని గెలుచుకున్నాయి. సుల్తాన్ ఉల్ ఉలూమ్ ఎడ్యుకేషనల్ సొసైటీ కార్యదర్శి జఫర్ జావీద్ విజేతలకు బహుమతులు అందజేశారు. తావూస్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు సఫి రహీం, డాన్ విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్ వసీ ఉర్ రెహమాన్, మెస్కో సెక్రెటరీ డాక్టర్ ఇఫ్తెఖార్ పాల్గొన్నారు.

జీహెచ్ఎంసీ ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల పనివేళలు మార్చాలి



జెడ్‌సీకు వినతిపత్రం అందజేస్తున్న గోపాల్ తదితరులు

సుల్తాన్‌బజార్: జీహెచ్ఎంసీ విభాగంలో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు పనివేళలు తెల్లవారుజామున 5 గంటలకు కాకుండా 6 నుంచి 7 గంటల మధ్య కొనసాగే విధంగా చర్యలు తీసుకోవాలని గ్రేటర్ హైదరాబాద్ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు ఉదారి గోపాల్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఘం జనరల్ సెక్రెటరి సంజు ఎల్బీనగర్‌జోన్ అధ్యక్షుడు హన్మంతు కోరారు. ఈ మేరకు శుక్రవారం జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్ కేశవ పాటీల్‌ను కలిసి ఉద్యోగుల తరఫున వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ..విధి నిర్వహణలో ఎస్ఎఫ్ఏ చనిపోతే అతని స్థానంలో నిబంధనల ప్రకారం అతని భార్యకు ఉన్న విద్యార్హతను బట్టి ఉద్యోగం ఇవ్వాలని కానీ ఆమెకు స్వీపర్ ఉద్యోగం ఇవ్వడం అత్యంత బాధాకరమన్నారు. ఈ విషయంపై దృష్టి సారించాలని జోనల్ కమిషనర్‌ను కోరినట్లు తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు



పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ వసీవుద్దీన్

యాకుత్‌పురా: ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని రెయిన్‌బజార్ కార్పొరేటర్ మహ్మద్ వసీవుద్దీన్ తెలిపారు. శుక్రవారం సాయంత్రం ఆయన డివిజన్‌లోని యాకుత్‌పురా బడాబజార్ జాఫర్‌రోడ్డులో కొనసాగుతున్న బీటీ రోడ్డు పనులను ఆయన నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు..గుంతలమాయంగా మారిన రోడ్లు, శిథిలావస్థకు చేరుకున్న డ్రైనేజీ పైప్‌లైన్‌లను తొలంగించి నూతన పైప్‌లైన్ పనులు చేపడుతున్నామన్నారు. బస్తీల్లో సమస్యల పరిష్కారానికి అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు.

'హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం'



షేక్‌పేట్‌లో ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్‌రెడ్డి

గోల్కొండ: రాష్ట్రంలో కాంగ్రెస్ అవినీతి పాలనతో ప్రజలు విసిగెత్తిపోయారని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నాయకుడు పి.విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన ఇంటింటికీ తిరిగి ఓటర్లను కలుసుకున్నారు. గత రెండేళ్లల్లో జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో కాంగ్రెస్ ఎటువంటి అభివృద్ధి పనులు చేపట్టలేదని ఆరోపించారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. ఈసారి జూబ్లీహిల్స్ నుంచి బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత భారీ మెజార్టీతో గెలుపొందడం ఖాయమన్నారు. ఆయన వెంట బీఆర్ఎస్ షేక్‌పేట్ డివిజన్ అధ్యక్షుడు దుర్గం ప్రదీప్ తదితరులున్నారు.

ముర్గీచౌక్‌లో అగ్ని ప్రమాదం

దూద్‌బౌలి: హుస్సేనీ ఆలం పోలీస్‌స్టేషన్ పరిధిలోని ముర్గీచౌక్ ప్రాంతంలో శుక్రవారం భారీ అగ్నిప్రమాదం జరిగింది. పోలీసులు, స్థానికుల వివరాల ప్రకారం.. ముర్గీ చౌక్ ప్రాంతంలో ఏ–వన్ స్వీట్ షాప్ ఆర్కే ఆప్టికల్స్ దుకాణాలు ఒకే భవనంలో కొనసాగుతున్నాయి. శుక్రవారం ఉదయం దుకాణ యజమానులు దుకాణ సముదాయాలు తెరిచేందుకు రాగా అందులో నుంచి పెద్ద ఎత్తున మంటలు వచ్చాయి. యజమానులు వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న హుస్సేనీ ఆలం పోలీసులు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. ఫైర్ ఇంజన్ల సాయంతో మంటలను ఆర్పి వేశారు. అగ్ని ప్రమాదం షార్ట్ సర్క్యూట్ కారణంగా జరిగి ఉండవచ్చునని పోలీసులు భావిస్తున్నారు.

స్వచ్ఛంద సేవకులుగా విద్యార్థులు

చాంద్రాయణగుట్ట: హైదరాబాద్ జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఐదు రోజుల పాటు చేపట్టిన పల్స్ పోలియో ఇమ్యూనైజేషన్ కార్యక్రమంలో ఫలక్‌నుమా ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు స్వచ్ఛంద సేవకులుగా చురుగ్గా పాల్గొనడం అభినందనీయమని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.ప్రవీణ్ కుమార్ కొనియాడారు. బాలాగంజ్ యూపీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ వసీం సుల్తానాతో కలిసి శుక్రవారం విద్యార్థులకు ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల పరిశుభ్రత కమిటీ ఇన్‌ఛార్జి జె.పరమేశ్వరీ పాల్గొన్నారు.



ప్రశంసాపత్రాలతో విద్యార్థులు

నానల్‌నగర్‌లో ఎమ్మెల్యే కౌసర్ పర్యటన



స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: మజ్లిస్ పార్టీ ఎప్పుడూ ప్రజల వెంటే ఉంటుందని ఆ ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. శుక్రవారం ఆయన నానల్‌నగర్ డివిజన్‌లోని పలు బస్తీలలో పర్యటించి స్థానికులను కలుసుకున్నారు. కార్వాన్ నియోజకవర్గంలో ఎక్కడా సమస్యలు లేకుండా చూడడమే తన ధ్యేయమన్నారు. దీన్ని కోసం తాను నిరంతరం బస్తీ బాట కార్యక్రమం చేపడుతూ పాదయాత్రలు చేస్తున్నామన్నారు. గోల్కొండ, లంగర్‌హౌస్, టోలిచౌకీ తదితర ప్రాంతాల్లో చిన్నపాటి వర్షానికే లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురైయ్యేవని ఆయన అన్నారు. ప్రస్తుతం టోలిచౌకీ వద్ద వరద నీటి నివారణ పనులు జరుగుతున్నాయని ఈ పనులు పూర్తయితే టోలిచౌకీ చౌరస్తా వద్ద వర్షపు నీరు నిలపడదన్నారు. ఆయన వెంట నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్ తదితరులున్నారు.